సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,10 ఫిబ్రవరి 2025


# మన్యం బందుకు 'సిపిఎం' సంపూర్ణ మద్దతు




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ఫిబ్రవరి 11,12 తేదీలలో జరిగే మన్యం బందుకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు ఎస్.రాజులుబాబు అధ్యక్షతన జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 1/70 చట్టంపై విశాఖలో జరిగిన పారిశ్రామికవేత్తలు సమావేశంలో ఆదివాసీ ప్రాంతం లో టూరిజం అభివృద్ధి పేరుతో 1/70 చట్ట సవరణ చేయాలని ప్రకటించడం ఆదివాసిలకు తీవ్ర ద్రోహం చేయడమేనని అన్నారు. ఇదేవిధంగా 2000 సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరు ఏజెన్సీలో చింతపల్లి జెర్రెలలో 515 మిలియన్ల టన్నులు బాక్స్ చేపల తవ్వకాలకు దుబాయ్ కంపెనీతో ఒప్పందం చేసుకొని గిరిజన సలహా మండలి లో 1/70 చట్టం చివరించడానికి పూనుకున్నారని అన్నారు. అప్పటి సిపిఎం పార్టీ భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాత్రమే చట్టం రక్షణకు నికరంగా నిలబడ్డారని గుర్తు చేశారు. కేంద్రంలో బిజెపి రాష్ట్ర తెలుగుదేశం కూటమి ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను తొలగించేందుకు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాల్సిన సమయం వచ్చిందని. ఆదివాసీలకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని సవరన చేయాలని చేసిన వ్యాఖ్యలను అయ్యన్నపాత్రుడువెనక్కి తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నదని వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యదర్శ వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అబ్కారీ శాఖ అప్రతిష్ట మూటగట్టుకుంటున్నది. అవినీతి ఆరోపణలు, అక్రమ వసూళ్ళు, బెల్టు షాపుల్లో అమ్మకాలు, బార్‌లోకి దొడ్డిదారిలో మద్యం నిల్వలు, ఆ శాఖ ఉన్నతాధికారుల మధ్య నిత్యం వివాదాలతో ఆ శాఖ పరువు బజారున పడుతుంది. రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సొంత జిల్లాలో ఎక్సైజ్ అధికారుల అక్రమ వసూళ్ళు, అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడం గమనార్హం. కీలక అధికారిపై తీవ్ర అవినీతి ఆరోపణలు, అక్రమ వ్యవహారాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు ఎక్సైజ్ శాఖను అపహాస్యం చేస్తున్నాయి. జాతీయ తెలుగు దినపత్రిక సూర్యలో ఎక్సైజ్ శాఖ అక్రమ వసూళ్ళపై ప్రచురించిన వరుస కథనాలతో అవినీతి అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. అయినా వసూళ్ళు మానడం లేదు. నెలనెల మామూళ్ళు ఇవ్వాలంటూ బెదిరింపులకు బరితెగించారు. ఎక్సైజ్ శాఖ అధికారుల అవినీతి పర్వంపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...

సూర్య బ్యూరో - ఉమ్మడి గోదావరి జిల్లాలు :

# అబ్కారీలో అవినీతి పర్వం !

## కొండెక్కిన ఎన్నికల కోడ్












కిక్కు శాఖలో రెన్యూవల్ పండుగ

- అప్రతిష్ట మూటగట్టుకుంటున్న జోనల్ కీలక అధికారి
- కాకినాడ బార్ల లోకి దొడ్డిదారిలో మద్యం!
- మద్యం దుకాణాలా... బార్‌లా?
- డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జిల్లాలో గాడితప్పిన ఎక్సైజ్ శాఖ
- నిద్రమత్తులో కాకినాడ జిల్లా ఎక్సైజ్ శాఖ
- ఒక్కో మద్యం షాపు నుంచి రూ.లక్ష అక్రమ వసూళ్ళు
- వైన్ షాపుల వద్ద అనధికార పర్మిట్ రూమ్‌లు
- మామూళ్ళ మత్తులో ఆ అధికారులకు బెల్టలు, అనదికార సిట్టింగ్‌లు కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు...!
- సూర్య వరుస కథనాలతో బెంబేలెత్తుతున్న ఎక్సైజ్‌లో అవినీతి అధికారులు
-తాజాగా మరో సీఐపై తీవ్ర ఆరోపణలు


ఎక్సైజ్ శాఖలో ఉద్యోగోన్నతులు, బదిలీలు పేరిట ఎవరు వచ్చినా పరిస్థితిలో మాత్రం మార్పు కనిపించడంలేదు. కొన్ని రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలో వెలుగుచూస్తున్న ఉదంతాలు సూర్యలో ప్రచురితమైన అక్రమ వసూళ్ళ కథనాలతో రాష్ట్రస్థాయిలోనూ చర్చనీయాంశంగా మారాయి. ఎక్సైజ్ శాఖలో కిందిస్థాయిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మొదలు సిఐ, ఈఎస్, ఎసి, డిసి స్థాయి వరకూ అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి..

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత ఎక్సైజ్ శాఖ అవినీతిలో బరితెగించి మరింత దిగజారింది. పత్రికల్లో కథనాలు వస్తున్నా దున్నపోతుపైన వర్షంలా పట్టించుకునేవారే కరువవడంతో అబ్కారీ అధికారులకు ఆడింది ఆట..పాడిందే పాటగా మారింది.

- మిగతా 2 లో..

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

- పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్ట ణంలో వేంచేసి యున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు న్నప్రసాద వితరణ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాద శర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచ ంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం శ్రీ స్వామివారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులు టికెట్ తీసుకుని స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. భక్తులు గ్రామస్తులు రథంతోపాటు రాజగోపురం చుట్టూ ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రథోత్సవ సేవలో ఆలయ వేద పండితులు, ఆలయ అర్చకులు, అర్చకులు, దేవస్థానం ఈవో వి.సుబ్బారావు దంపతులు, ఏఈఓ కొండలరావు, పిఆర్‌ఓ దామోర్ల కృష్ణారావు, ఆలయ సూపర్డెంట్లు సుబ్రహ్మణ్యం, సతీష్, సూపర్డెంట్ ఐ.వి.రామారావు, పిఆర్‌ఓ విభాగం గణపతి, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వస్వమును విద్యాభివృద్ధికి అర్పించిన త్యాగశీలి నాయకర్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక జగన్నాధపురం ఎమ్.ఎస్.ఎన్ చారిటీసు వ్యవస్థాపకులు మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 110వ వర్ధంతి ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్.ఎస్.ఎన్ చారిటీసు వంశ పారంపర్య ధర్మకర్త మరియు ఛైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడుతూ స్ఫూర్తి ప్రదాత నాయకర్ అని, ఆయన విద్యాభివృద్ధికి తన సర్వస్వమును త్యాగం చేసిన త్యాగశీలి నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిం చిన యం.యస్.యన్ చారిటీస్ సహాయక కమీషనర్, కార్యనిర్వ హణాధికారి మరియు కరస్పాండెంట్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. మహా దాత నాయకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పూర్వపు ధర్మకర్తల మండలి సభ్యులు పొన్నమండ విజయకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయకుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్. ఎస్. సుబ్రహ్మణ్యం, ప్రాధమిక పాఠశాల బి.గంగాధరరావు, వేద గురువు ఎన్.టి.వి.అవధాని, జి.క్రాంతివీర్, కె.ఎన్.శ్రీనివాస్, వంశి, చంద్ర మౌళి, రాంబాబు, పూర్వ విద్యార్థులు ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ ముళ్ళపూడి నాగేశ్వరరావు, రావుల శ్రీరాం, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ క్రీడాంశాలు, వివిధ పోటిలలో విజేతలకు బహుమతులు అందించారు. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...ఎమ్.ఎస్.ఎన్ చారిటీసు విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు నిర్వహించిన మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ నృత్య నివాళి అలరించింది. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, సాంప్రదాయ నాట్యాలు, జానపద నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రము గ్ధులను చేశాయి.

## టిడిపి సీనియర్ నాయకులు నాగేశ్వరావు మృతి పార్టీకి తీరని లోటు

- పార్థివదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శిరీష దేవిభాస్కర్ దంపతులు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** టిడిపి సీనియర్ నాయకులు, గడువొ్ర్తి మాజీ సర్పంచ్, టిడిపి మండల ఎస్ టి సెల్ అధ్యక్షులుగా సేవలు అందించిన చలుమూర్తినాగేశ్వరరావు అకాల మృతి పార్టీకి, పంచాయతీకి తీరని లోటని రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి విజయ భాస్కర్ దంపతులు అన్నారు. నాగేశ్వ్రరావు శనివారంసాయింత్రం రాజమండ్రి ఆసుపత్రిలో ఆకస్మికంగా ప్రాణాలు విడిచారు. ఎమ్మెల్యే శిరీష భాస్కర్ వారి ఉచిత అంబులెన్స్‌లో నాగేశ్వరరావు స్వగృహం గొబ్బులమడుగుకు నాగేశ్వరావు పార్థీవ దేహాన్ని చేర్చడం జరిగింది. ఎమ్మెల్యే దంపతులు పార్థివ దేహాన్ని సందర్శించి ఘన నివాళు లర్పించారు. మంచి మనిషి,సౌమ్యుడు,పంచాయతీ గ్రామాల అభివృద్దే ధ్యేయంగా నిరంతరం తపించే వ్యక్తి మాజీ సర్పంచ్ చలుమూర్తి నాగేశ్వరరావు అని ఎమ్మెల్యే దంపతులు ఆయన సేవలను కొనియాడారు. ఆయన్ని కోల్పోవడం తెలుగుదేశం పార్టీకి గడువో కుర్తి పంచాయతీకి తీరని లోటు అని అన్నారు. ఎమ్మెల్యే దంపతులతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని మాజీ సర్పంచ్ నాగేశ్వ్రరావు సేవలను స్మరించుకుని పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ స్సాభూతిని తెలియజేశారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే దంపతులు

- గిరిజన యువతి వైద్యం నిమిత్తం
50 వేల ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే దంపతులు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** గతకొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న గిరిజన యువతికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాలశిరీష విజయ్ భాస్కర్ దంపతులు వైద్యం నిమిత్తం రూ 50,000 ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. నియోజకవర్గంలోని వై రామవరం మండలం పి ఎర్రగొండ గ్రామానికి చెందిన పల్లాల శ్రీలత అనే యువతి గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. కూటమి నేతల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్ దంపతులు ఆదివారం వై రామవరం మండల టిడిపి సీనియర్ నాయకులు గొర్లె శ్రీకాంత్ ఆధ్వర్యంలోని బాలయోగి తదితర కూటమి నేతల సమక్షంలోరూ రూ 50,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలానే అనారోగ్యంతో ఉన్న శ్రీలతను ఆమె స్వగ్రామం నుండి హైదరాబాదు ఆసుపత్రి వరకు తీసుకువెళ్లేందుకు ఎమ్మెల్యే దంపతులు సొంత అంబులెన్స్ కూడా ఏర్పాటు చేశారు. కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరినిస్వయంగా కలుస్తూకూటమినేతల ద్వారా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష దేవి భాస్కర్ దంపతులను ఏజెన్సీ కూటమి నాయకులు కార్యకర్తలు అభినందించారు.

## వడ్లమూరులో శ్రీ సత్తెమ్మ అమ్మవారి గుడి వద్ద అన్నదానం

- పాల్గొన్న భక్తులు



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలో ఆదివారం దేవళ్ళ కుటుంబ సభ్యుల వారి కోడలు, మట్టపర్తి వారి ఆడపడుచు అయిన శ్రీశ్రీశ్రీ సత్తెమ్మ అమ్మవారి గుడి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా భారీ అన్నదానం కార్యక్రమంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవళ్ళ కుటుంబీకులు, మట్టపర్తి వారి కుటుంబీకులతో పాటు చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి





రంపచోడవరం,మేజర్‌న్యూస్ :ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ విజ్ఞప్తి చేశారు. రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులోని మిషన్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ తలారి సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ దాసరి ఉమమహేష్, డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొని సుమారు 260 మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియజేశారు. ఈ శిబిరంలో అవసరమైనవారికి 74మందికి రక్తపరీక్షలు, 10మందికి థైరాయిడ్ పరీక్షలు, నలుగురికి ఇ.సి.జి.లు, 13 మందికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజి తెలిపారు. కాగా పరమహంస యోగానంద నేత్రలయం వేమగిరి వారిచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరంలో 58మందికి కంటి పరీక్షలు చేసి 8మందికి కళ్లజోళ్లు అందిచారు. కంటి ఆపరేషన్లు నిమితం 8మందిని వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానికి తరలించారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ చెప్పారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటిబాబు, వాలంటీర్స్ దాసరి పెద్దఅప్పారావు, సూర్య, రిటైర్డ్ హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్, గుండెమెను రామారావు, వై.అప్పలరాజు, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరానికి హాజరైన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

## 12న ఏజెన్సీ సంపూర్ణ బంద్ విజవంతం చేయండి

- అయ్యన్న పాత్రుడు ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలి
- స్పీకర్ బాధ్యతలనుండి తొలిగించాలి



**చింతూరు,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ, చింతూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చింతూరు డివిజన్ స్థాయి 12 తేదీన బంద్ సన్నాహక సమావేశం ఛైర్మెన్ జల్లి నరేష్ అధ్యక్షతన చింతూరు ఎస్.ఎం.హెచ్.బాయ్స్ హాస్టల్లో నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఏపిఏ జెఏసి కేంద్ర కమిటీ సభ్యులు మడివి నెహ్రూ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ద పదవిలో ఉంటూ రాజ్యాంగబద్ద చట్టల అమలు పర్యవేక్షించాల్సిన ఆంధ్రప్రదేశ్ శాసనసభా స్పీకర్ అయ్యన్న పాత్రుడు - ఏజెన్సీ లో అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు 1/70 చట్టాన్ని సవరించాలి అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతూ అలానే ఆదివాసీలు పెట్టుబడులు పెట్టలేరు అంటూ ఆదివాసీలను కించపరిచేలా మాట్లాడడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ రాష్ట్రావ్యాప్తంగా ఏజెన్సీ బందుకు పిలుపునిచ్చింది. ఈ ఆదివాసీల మనుగడ పోరాటానికి యావత్ ఆదివాసీ సమాజంతోపాటు, ఆదివాసీ ప్రాంతంలో వ్యాపారాలు చేస్తున్న వ్యాపారాలు, వర్తక సంఘాలు, ఆటో, మ్యాజిక్ యూనియన్లు, రైతులు, రైతు కూలీలు తప్పక సంపూర్ణ బంద్ పాటించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఏపిఏ జెఏసి రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ మాట్లాడుతూ అయ్యన పాత్రుడు వెంటనే ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని లేదా ప్రభుత్వం అయ్యన్నపాత్రుడుని శాసనసభా స్పీకర్ బాధ్యతల నుండి తొలిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఏ జెఏ వైస్ ఛైర్మెన్ సీలం తమ్మయ్య, చింతూరు డివిజన్ ఉద్యోగ కన్వీనర్ తిమ్మ సాయి, కోశాధికారులు సోడె బాలకృష్ణ, సహాయ కార్యదర్శి బొడ్డు బాలరాం, చింతూరు మండల ఏపిఏ జెఏ తీగల రవి, కాక సీతారామయ్య, ఎటపాక మండల ఛైర్మెమ్ కుంజా శ్రీను, లీగల్ ఎడ్వైజర్ ఆత్రం నవీన్, సూరకుంట గ్రామ పెద్ద తోడం చంద్రయ్య, గొటుల్ కో-ఆర్డినేటర్ సోడె శ్రీను, పెస కార్యదర్శి కారం సాయిబాబు, పెస సెక్రెటరీ సోయం అర్జున్, సోడె అర్జున్, కారం దుర్గారావు, పూసం విష్ణు, కట్టం తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడిని తల్లితండ్రులకు అప్పగింత




**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పరిధిలో గల స్థానిక వాలుతిమ్మాపురం రోడ్డులో పట్టాభి ఆగ్రోఫుడ్స్‌లో పనిచేస్తున్న కౌసు ప్రసాద్ కుమారుడు తప్పిపోయినట్లు ఆదివారం సమాచారం రావడంతో ఎస్సై వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు తనిఖీలు నిర్వహించి

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో బాలుడిని గుర్తించి తల్లితండ్రులకు అప్పగించినట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి సమష్టి కృషి చేయాలి

**– దేవరపల్లి గ్రామ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సత్యానందరావు**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్ విజయానికి సమష్టి కృషి చేయాలని కూటమి నాయకులకు, కార్యకర్తలకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి తమ ఓటును పేరాబత్తుల రాజశేఖర్ కు తమ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సత్యానందరావు కోరారు. పట్టభద్రుల సమస్యలపై రాజశేఖర్ పోరాడతారని కావునా ఆయనను శాసనమండలికి పంపించాలని సత్యానందరావు పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

**– మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణకు రంగం సిద్ధం**

**– వేగంగా, ప్రామాణికమైన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన రెవిన్యూ యంత్రాంగం**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి తీసుకున్న నిర్ణయంతో అర్హులైన పేదలకు లబ్ధి చేకూరనున్నట్లు జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈజీగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం దక్కింది. ఈ పథకానికి సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సిసిఎల్ఏ ఛీఫ్ కమీషనర్ జి.జయ లక్ష్మి తెలియ చేసినట్లు, అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సూచనలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిఓ నెంబర్ 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతామని, ఈ సంవత్సరం 2025 డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. క్రమబద్ధీకరణకు మేరకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ పూర్తి వివరాలను నిర్దేశించిన ధృవీకరణ పత్రాలతో మీసేవ ద్వారా అప్ లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. 2019 అక్టోబరు 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆతేదీ కంటే ముందు ఆక్రమణలలో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి



క్రమబద్ధీక రించడం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి సిసిఎల్ఏ అధికారులు అత్యంత వేగంగా, ప్రామాణిక మైన దరఖాస్తు విధానాన్ని మీసేవ ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చారు.

–విధి విధానాలు నిబంధనలు :

1) 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదు. 2) దారిద్రరేఖకు దిగువను ఉండి 151 నుండి 300 గజాల లోపు అక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలి. 3) దారిద్రరేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 4) 300 నుండి 450 గజాల పరిధిలో బిపిఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 5) ఇదే విభాగంలో దారిద్రరేఖకు ఎగువన ఉన్న వారు 200శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుంది. 6) 450 గజాలకు మించిన అక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవలసి ఉంటుంది.

అందుకు సిద్ధంగా లేకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయబోరన్నారు. లబ్ధిదారులు, కుటుంబసభ్యులు ఐటీ చెల్లింపుదారై ఉండకూడదని, నాలుగు చక్రాలు వాహనం ఉండకూడదని స్పష్టం చేసారు. గరిష్ఠంగా గ్రామాల్లో నెలకు రూ. 10,000, పట్టణాల్లో నెలకు రూ. 14,000 ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులుగా నిర్ణయించగా, నెలకు రూ. 300 లోపు విద్యుత్తు ఛార్జీల చెల్లింపు ఉండాలన్నారు. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించకూడదు. ఆర్‌సీసీ రూఫ్/ఆస్‌బెస్టాస్ రూఫ్‌తో ఇటుక గోడలతో నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇప్పటికే స్వీకరించి, పెండింగులో ఉన్న దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటామని, జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలు పరిశీస్తారన్నారు. అనంతరం అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితాను గ్రామ,వార్డు కార్యాలయాల్లో ప్రదర్శిస్తారని, అభ్యంతరాలు స్వీకరించి తహసీల్దార్లు తుది జాబితాను సబ్‌కలెక్టర్ / ఆర్‌డీఓకు పంపిస్తారన్నారు. సబ్ డివిజన్ లెవెల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టర్‌కు 30 రోజుల్లోగా అప్పీలు చేసుకోవచ్చన్నారు. అర్హుల జాబితా ఖరారైన తర్వాత ఆ వివరాలను తహసీల్దార్లు ఆ ప్రాంత సబ్–రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారని, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సిసిఎల్ఏ ఆదేశాలు జారీ చేసిందని, అందుకు అనుగుణంగా అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## వాతంగిలో పోలీసులు పల్లె నిద్ర



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని లోతట్టు గిరిజన ప్రాంతమైన వాతంగి గ్రామంలో పోలీసులు శనివారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జడ్డంగి ఎస్ ఐ చిన్న బాబు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా వాతంగి గ్రామస్తులతో సమావేశమయ్యారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలానేబాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని పిల్లలను చక్కగా చదివిస్తే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. గంజాయి పండించినా, ట్రాన్స్పోర్టేషన్ చేసి పట్టు బడినా జీవితాలు నాశనం అవుతాయన్నారు. అనంతరం స్నాక్స్ అంద జేశారు. అలానే యువతకు వాలీబాల్ కిట్లు ఇవ్వడం జరిగింది.

## ఉచిత దంత వైద్య శిబిరం..



**ఆలమూరు,మేజర్‌న్యూస్ :** మండలంలోని పినపళ్ళ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అంజన మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సంగీత్ సుభాష్ పాల్గొని ప్రారంభించారు. డాక్టర్స్ రేవంత్, చంద్రశేఖర్ కలిసి గ్రామ ప్రజలకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి వారికి వైద్య సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవునికి సోకే అన్ని రోగాలకు కారణం దంతాలు కాబట్టి దంతాలను రక్షించుకుంటే అన్ని అవయవాలు రక్షించుకోవచ్చు అని తెలిపారు. అనంతరం ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పట్టాభి రామన్న, మాజీ ఏఎంసి చైర్మన్ వక్కపట్ల లచ్చిబాబు, వెంకట సాయి రైస్ మిల్ అధినేత వట్టికూటి సతీష్ బాబు,రాష్ట్ర కాపు కార్యదర్శి పెద్దిరెడ్డి మహేష్, గ్రామ జనసేన పార్టీ ప్రెసిడెంట్ నామాల సుబ్బారావు,ధనరాజ్ నాయుడు, సిబ్బంది విజయ్,పిఆర్ఓ సత్య,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డాఎం బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు పినిపే విశ్వరూప్ ఆదేశాల మేరకు అలాగే కొత్తపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి నియమించిన జిల్లా మరియు కొత్తపేట నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆయన స్వగృహం నందు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గొల్లపల్లి డేవిడ్ నియమించబడ్డారు. అలాగే కొత్తపేట నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగానికి పాల నాగేశ్వరరావు , రైతు విభాగానికి పెదపూడి బాపిరాజు , బీసీ సెల్ విభాగానికి బొక్క ప్రసాద్, ఐటీ విభాగానికి కొవ్వూరి సుధాకర్ రెడ్డి, యువజన విభాగానికి నడింపల్లి వెంకట సుబ్బరాజు (వర్మ), విద్యార్థి విభాగానికి గొల్లపల్లి రాజశేఖర్ నియమించబడ్డారు. మమ్మల్ని అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమించిన చిర్ల జగ్గిరెడ్డి గారికి కృతజ్ఞతలు చెబుతూ ఇచ్చిన బాధ్యతలపై కష్టపడతామని మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని అలాగే చిర్ల జగ్గిరెడ్డి ని ఎంఎల్ఏ చేసేవరకూ శ్రమిస్తామని తెలిపారు.. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంకా కష్టపడే నాయకులు, కార్యకర్తలకి కచ్చితంగా ఉన్నత స్థానాలలో పెట్టేలా కృషి చేస్తాను అలాగే 2019 నుండి 2024 మధ్యలో కార్యకర్తలు నిరుత్సాహం విషయం తెలుసుకుని జగన్మోహన్ రెడ్డి కూడా కార్యకర్తలకి ఈసారి పెద్దపీట వేస్తానని చెప్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అబ్కారీలో అవినీతి పర్వం !

1పేజి తరువాయి



మామూళ్ళ మత్తులో ఊగుతూ తూగుతూ, తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖలోని కొంతమంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సిఐలు మద్యం విక్రయాలతోపాటు మామూళ్ళ వసూళ్ళలోనూ టార్గెట్‌లను పెట్టుకుని పనిచేస్తున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా నెలవారి మామూళ్ళకు తెగబడిన ఓ సిఐపై అవినీతి ఆరోపణపై తీవ్ర చర్చ జరుగుతోంది.

### బార్ లా మద్యం దుకాణాలు..

మద్యం దుకాణాల నిర్వాహకులు వైన్‌షాపుల వద్ద అనధికార పర్మిట్‌రూములను ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు దుకాణం నిర్వాహకులు ఏర్పాటు చేసిన రూములలో మద్యం సేవిస్తున్నారు. ఇది అందరికీ కనిపిస్తున్న బహిరంగ రహస్యం. అయితే ఎక్సైజ్ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. మద్యందుకాణాల నిర్వాహకులుఅందించే మామూళ్ళ మత్తులో ఆఅధికారులకు సిట్టింగ్ రూములు కనిపించడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మద్యం దుకాణాలా... లేక బార్‌లా అని ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 413 మద్యం దుకాణాలు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 155లో సుమారు 100 మద్యం దుకాణాలకు సంబంధించి అనధికారికంగా ఆయా దుకాణాల వద్ద సిట్టింగ్ రూములు ఏర్పాటు చేశారు. దీంతో కొన్నిచోట్ల గలాటాలు, కొట్లాటలు కూడా జరుగుతున్నాయి. లా అండ్ ఆర్డర్ పోలీసులు ఎంతో కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అనధికారిక సిట్టింగ్ రూములు, బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకోండి, నెలనెల మామూళ్ళు మాకు ఇవ్వండని కాకినాడ జిల్లాలోని ఎక్సైజ్ సిఐలు బరితెగించి మద్యం దుకాణాల నిర్వాహకులను ప్రోత్సహిస్తూ అక్రమ వసూళ్ళకు తెగబడుతున్నారు.


### బార్‌లలో దొడ్డిదారిలో మద్యం...!

కాకినాడ జిల్లాలోని బార్లలో నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన మద్యం విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నా కనీసం తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం బార్‌లకు ఎంఆర్‌పికి మద్యం సరఫరా చేస్తుంది. ఆ ధరపై క్వాటర్‌కి ఇప్పుడు రూ. 30 అధికంగా అమ్మకాలు చేస్తున్నారు. ఈ కారణంగా బార్లు నష్టాల్లో ఉంటున్నాయి. ఎక్సైజ్ కీలక అధికారికి ప్రతి నెల బార్ యజమానుల నుంచి రూ. 50 వేలు లంచంగా ఇచ్చేలా ఏర్పాటు చేసుకొని , బార్ల లో అక్రమాలకు ప్రోత్సాహం అందిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. దీంతో వైన్‌షాపులకు ఇచ్చే మద్యాన్ని దొడ్డిదారిలో బార్‌లకు తరలించి అమ్మకాలు చేస్తున్నారు. దీనివల్ల క్వాటర్‌పై రూ. 30తోపాటు ఎంఆర్‌పికి 9 శాతం రెండు మిగులుతున్నాయి. ఇలా బార్ యజమానులు యధేచ్చగా అక్రమాలకు పాల్పడుతున్నారని సమాచారం. ముఖ్యంగా ఓ నాయకుడి బార్ ఈ వ్యవహారంలో బాగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇలా ఇంకా అనేక అక్రమాలు బార్‌లలో జరుగుతున్నా కనీసం సిఐలు సిబ్బందితో వెళ్ళి తనిఖీలు జరపకపోవడం అవినీతికి పరాకాష్ట కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా...ఆగని అక్రమ మద్యం అమ్మకాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులు, మద్యం షాపులు బారుల్లా తలపిస్తున్న సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. పార్టీల మధ్య గొడవలు రావడానికి బెల్ట్ షాపులు, అధికార సిట్టింగ్‌లే కారకాలు. అటువంటి ప్రమాదకర పరిస్థితులను నివారించడానికి ఎన్నికల కోడ్ను తప్పనిసరిగా అమలుపరచాల్సి ఉండగా మామూళ్ళ మత్తులో చేతులెత్తేశారు.

## పి.డి.ఎఫ్ గ్రాడ్యుయేట్ యమ్.ఎల్.సి అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ యమ్ ఎల్ సి అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులు ను ఈరోజు కాకినాడ యూ.టి.ఎఫ్ హాంలో జరిగిన వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశంలో ప్రస్తుత గ్రాడ్యుయేట్ యమ్ఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు ప్రకటించి, సభకు పరిచయం చేసారు. గత 18 సంవత్సరాల శాసనమండలి చరిత్రలో ప్రజా సమస్యల పరిష్కారంలో పి.డి.ఎఫ్ యమ్.యల్.సిలు నిరంతరం కృషి చేశారు అని ఐ.వి తెలిపారు. అదే బాటలో నేను అనగా దిడ్ల వీరరాఘవులు (డి.వి.రాఘవులు) పనిచేస్తానని తెలిపారు. 41 సంవత్సరాల ఉపాధ్యాయుడుగా పనిచేసేనని, యూ.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జేఏసీ చైర్మన్‌గా, ఫ్యాఫ్టో చైర్మన్‌గా పనిచేసారు అని తెలిపారు. తాను గ్రాడ్యుయేట్ యమ్ఎల్‌సిగా ప్రస్తుతం నిలబడుతున్న సమయంలో గ్రాడ్యుయేట్లు అందరూ తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను గెలిస్తే, శాసనమండలిలో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, "ప్రశ్నించే గొంతికగా" ఉంటానని, ముఖ్యంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే విధంగా "ఉద్యోగ క్యాలెండర్" ప్రభుత్వంచే ప్రతీ సంవత్సరం రిలీజ్ చేసే విధంగా ప్రయత్నం చేస్తానని చెప్పారు. యూ.టి.ఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా రంగంలో సమస్యలు పరిష్కారం కోసం డి.వి.రాఘవులు పని చేస్తారు అని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు, పెన్షన్ సంఘాలు డి.వి. రాఘవుల అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సూరిబాబు, నగేష్, రాష్ట్ర కార్యదర్శులు చక్రవర్తి, జ్యోతిబసు, యూటీఎఫ్ నాయకులు సాయిరాం, సీతారామయ్య, గోవింద రాజులు,ఐ.ప్రసాదరావు, గణేశ్వరావు, పి.వి.వి.సత్యనారాయణ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు, ప్రజా సంఘాల నాయకులు వీరబాబు, రాజా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో బర్డ్ ఫీడర్ తయారీపై అవగాహన

**– బర్డ్ ఫీడర్స్ విరివిగా తయారు చేయండి – డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బర్డ్ ఫీడర్ తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు పక్షుల నీటిమడుగుల తయారీపై సీనియర్ ఎన్ఎస్–ఎస్ ప్రోగ్రాం అధికారిఎల్‌దివాకర్‌రావు అవగాహన కల్పించారు. వేసవి సమీపించడం వల్ల పక్షులు నీటికి, తిండి గింజలకు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందని విద్యార్థులు నీటిమడుగులను తయారుచేసి పక్షులకు ఇబ్బంది కలగకుండా చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద జంతువులకు, పక్షులకు నీరు అందుబాటులో ఉండేలా చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇంచార్జ్ మూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, ఐ గౌరీ ప్రియ మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా మధుశ్రీ గౌరవ సభ



**కాజులూరు, మేజర్ న్యూస్ :** కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామం లో మధుశ్రీ గౌరవసభ కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహించారు. డాక్టర్ టి విశ్వనాధ రావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభం చేశారు. మధునాపంతుల ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ కిరణ్ మధునాపంతుల ప్రస్తావనతో సభ ప్రారంభమైంది. ఏటా తన తండ్రి పేర చేసే ఈ సభ తనకెంతో సంతృప్తి ఇస్తుందని తన తండ్రి మధు శ్రీ కథలు రాసారని ఆ 59 కథలని మధుశ్రీల పేరిట పుస్తకంగా విడుదల చేశామని వారి అనంతర కాలంలో కథకులు గౌరవించడం తద్వారా తండ్రిని గౌరవించుకోవడం వంటిదని భావిస్తున్నట్లు చెప్పారు. తొలిత సభా అధ్యక్షుడు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి గౌరవ స్వీకర్తల ఎంపిక దగ్గర నుండి సభ జరిపే వరకు తీసుకునే శ్రద్ధల గురించి చెప్పారు. నామిని సుబ్రమణ్యనాయుడుకి 20000 రూపాయల నగదు, శాలువా, జ్ఞాపిక తో కిరణ్ సత్కరించారు. అనంతరం నామిని గూర్చి జి కె యస్ రాజా మాట్లాడుతూ నామిని స్వచ్ఛమైన రచయిత అన్నారు. నామిని ఈ కథాగౌరవం స్వీకరించడం తనకు ఎంతో సంతోషం గా ఉంది అన్నారు. అనంతరం వాడ్రేవు వీరలక్ష్మీ దేవికి కథా గౌరవ పురస్కారం20000 రూపాయలు, శాలువా, జ్ఞాపిక కిరణ్ అందజేసారు. వీరలక్ష్మీ దేవి సమగ్ర సాహిత్యాన్ని స్పృశిస్తూ వసుధారాణి మాట్లాడారు. వీరలక్ష్మీ దేవి ఆంధ్రీకుటీరంతో తనకు గల సుధీర్ఘమైన అనుబంధాన్ని తలుచుకున్నారు. అనంతరం డాక్టర్. కాళ్ళకూరి శైలజను(తొలి కథా సంపుటి)10000రూపాయలు, శాలువా, జ్ఞాపిక తో కిరణ్ మధునాపంతుల సత్కరించారు. కాళ్ళకూరి శైలజ సాహిత్యాన్ని డాక్టర్. కె రామచంద్రా రెడ్డి చక్కటి ప్రసంగం చేశారు. శైలజ ధన్యవాదాలు తెలుపుతూ ఇది తనకు గొప్ప స్ఫూర్తినిస్తుందని మరింత సాహిత్య సృజన చేయగలనని అన్నారు. తొలుత %వీ ఎ% చలపతి సెక్రటరీ ఫౌండేషన్ స్వాగతం పలికి చివరిగా వందన సమర్పణ చేశారు. ఉభయగోదావరి జిల్లాల నుండి ఇతర రాష్ట్రాల నుండి కథారచయితలు, అభిమానులు ,స్నేహితులు హాజరైనారు. తదనంతరం ఈ కార్యక్రమం విందుతో ముగిసింది.

## డ్రోన్ ద్వారా ప్రకృతి వ్యవసాయం సులభతరం

**– యూనిట్ ఇంచార్జ్ అక్కన కాశీ విశ్వనాథం**



**పెరవలి, మేజర్ న్యూస్ :** డ్రోన్‌ల ద్వారా క్రిమి సంహారక మందులు వాడకుండా వేప గింజల కషాయం జివామృతం తదితర ఆర్గానిక్ పద్ధతులు ఉపయోగించడం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేయడం చాలా సులభతరమని దీనిపై ప్రతి ఒక్క రైతు తమ సలహాలు సూచనలు తీసుకుని ప్రకృతి వ్యవసాయం ద్వారా తమ పంటలు పండించుకోవచ్చని యూనిట్ ఇంచార్జ్ అక్కిన కాశీ విశ్వనాథం అన్నారు. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలో ఫిబ్రవరి 9వ తేదీ ఆదివారం తాటిపర్రు,ఉండ్రాజవరం గ్రామాలలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తాతరావు, జూనియర్ ప్రాజెక్ట్ ఎడ్యుకేట్ మేనేజర్ రామకృష్ణ,డిస్ట్రిక్ట్ మోడల్ మేకర్ పురుషోతం ఆదేశాలు ప్రకారంయూనిట్ ఇంచార్జి గారపాటి సత్యనారాయణ, యూనిట్ ఇంచార్జి అక్కిన కాశీ విశ్వనాధం పర్యవేక్షణలో 35 ఎకరాలు లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులులో వేపగింజల కాషాయం, పాల ఇంగువ,మీనామృతం, కలిపి డ్రోన్ ద్వారా స్ప్రెయింగ్ చేయించటం జరిగింది. అలాగే ఇప్పటివరుకు రెండుగ్రామలులో 200 ఎకరాలులో డ్రోన్ ద్వారా పిచికారి చేయించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ఐసిఆర్ పిలు పెదపాటి ఉమా మహేశ్వరీ, మాదే ఇందిర, కడలి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భక్తాంజనేయ స్వామి ఏకాహ మహోత్సవంలో పటిక బెల్లం తులాభారాలతో భక్తుల మొక్కులు చెల్లింపు

**– రెండో రోజు కార్యక్రమంలో భాగంగా హనుమాన్ చాలీసా**



**పెరవలి, మేజర్ న్యూస్ :** నల్లాకులవారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఏకాహ మహోత్సవాలు ఫిబ్రవరి 8వ తేదీ శనివారం నుండి అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 9వ తేదీ ఆదివారం స్వామి వారికి పటిక బెల్లం తులాభారాలతో భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. సంవత్సరానికి ఒకసారి జరిగే ఈ ఏకాహ మహోత్సవాలలో స్వామివారిని దర్శించుకుంటే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని సర్వ శుభాలు జరుగుతాయని భక్తులు నమ్మకం. తమ కోరికలు నెరవేరిన భక్తులు తులాభారాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

రెండో రోజైన ఆదివారం ఉదయం తుట్టకుంట అచ్యుతరామయ్య గురుదేవుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది దీనికి పెద్ద సంఖ్యలో పరిసర గ్రామాల నుండి మహిళలు హాజరయ్యారు సుదీర్ ప్రాంతాల నుండి వచ్చిన విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలవకుండా ఉత్సవ కమిటీ వారు చక్కటి ఏర్పాట్లు చేయడంతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు.

# లయన్ క్లబ్ రీజియన్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా ఎమ్మెస్ఆర్వీ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రీజియన్ చైర్ పర్సన్ లైన్ పద్మ తులసి అధ్యక్షతన స్థానిక సూర్య కళామందిర్‌లో జరిగిన శ్రీ స్నేహ పద్మం లైన్స్ రీజనల్ కాన్ఫరెన్స్ లో లైన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ కి అవార్డుల పంట పండింది. ఈ కార్యక్రమంలో రీజియన్-2కి చెందిన16 క్లబ్బులు నుండి మరియు జిల్లాకి చెందిన వివిధ క్లబ్బుల నుండి 200 మంది పాల్గొనగా, లైన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్‌కి 9 అవార్డుల రావడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. రీజియన్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా లైన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ క్లబ్ అధ్యక్షుడు ఎమ్మెస్ఆర్వీ సత్యనారాయణకి రీజియన్ చైర్పర్సన్ పద్మ తులసి చేతుల మీదుగా అవార్డు అందచేశారు. అంతే కాకుండా బెస్ట్ క్లబ్, బెస్ట్ డయాబీటీస్ ప్రాజెక్టు, బెస్ట్ సైట్ ప్రాజెక్టు, బెస్ట్ పెరిమినెంట్ ప్రాజెక్టు, బెస్ట్ హెల్త్ కాంప్స్ మొదలగు 9 అవార్డులు వచ్చాయి. ఈ కార్యక్రమానికి పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ ముఖ్య అతథిగా విచేయగా, మరో పూర్వపు గవర్నర్ ముంజులూరు విశ్వేశ్వరరావు ప్రధాన వక్తగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ఉప గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, కటకం శ్రీనివాస్, రాఘవరావు, ఎన్వీవీ సుబ్రహ్మణ్యం, శాస్త్రి, సత్తిరెడ్డి, కిషోర్, వివిధ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన 'షావోలిన్ డ్రాగన్ అండ్ టైగర్స్ మార్షల్ ఆర్ట్స్' విద్యార్థులు



**రాజమండ్రి, మేజర్ న్యూస్ :** ఈ నెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకూ న్యూఢిల్లీలో నిర్వహించిన ఫోర్త్ వాకో ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలలో షావోలిన్ డ్రాగన్ అండ్ టైగర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సామ్యూల్ రాజు విద్యార్థులు సత్తా చాటారు. 20 దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలో అకాడమీ నుంచి 8 మంది పాల్గొనగా, ఎనిమిదిమందీ మెడల్స్ సాధించారు.

# ముక్తి ద్వారానే మానవ జన్మకు సార్ధతకత

**– ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ముక్తి ద్వారానే మానవ జన్మకు సార్ధతకత కలుగుతుందని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజులు పాటు జరిగే పీఠం 97వ వార్షిక జ్ఞాన మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఉమర్ ఆలీషా మాట్లాడుతూ... జీవాత్మ పరమాత్మగా పరిణామం చెందే అద్భుత అవకాశం ఒక్క మానవ జన్మకు మాత్రమే ఉందని, ముక్తిని పొందాలంటే కోరికలు లేని స్థితికి మానవుడు చేరుకోవాలని, గురువును ఆశ్రయించి ఆధ్యాత్మిక, తాత్విక తత్వ జ్ఞానాన్ని గ్రహించాలని తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిబిఐ మాజీ జేడి వి.వి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నమ్మిన గురువుతో ప్రయాణం చేస్తే శిష్యుని జీవితం సార్ధకమౌతుందన్నారు. 2025 నివేదిక మరియు ట్రస్ట్ విశిష్టతలను తెలిపే ఆంగ్లము, తెలుగు బ్రోచర్ లను ముఖ్య అతిధులు సిబిఐ మాజీ జెడి వి.వి.లక్ష్మీనారా యణ,




కాకినాడ జిల్లా 3 వ అడిషనల్ జడ్జ్, పి.కమలాదేవి, నర్తన ఋషి డాక్టర్ సప్పా దుర్గా ప్రసాద్ లచే ఆవిష్కరింప చేశారు. ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ షా, చింత పల్లి అమృతవల్లి, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యుడు పింగళి ఆనంద్ కుమార్, కె. స్వర్ణలత, ఎన్. రాంగోపాల్ వర్మ, ఎన్ ఆర్ ఐ సభ్యులు టి.ఎస్.వి. శ్రీనివాస్, సూర్య కుమార్, ఉషారాణి లు మాట్లాడుతూ... తాత్విక జ్ఞానాన్ని గ్రహించడం ద్వారా మానవుడు తన జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురం సీఐ జి. శ్రీనివాస్, జె ఎన్ టి యు, ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. సుమలత, డాక్టర్ హరనాథ్ రాజు, సౌత్ సెంట్రల్ రైల్వే సబర్బన్ ట్రైన్స్ జనరల్ సెక్రటరీ నూర్ అహ్మద్ ఆలీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ వేర్ హౌస్ మేనేజర్ కె. సుధాకర్ రెడ్డి, యోగరత్న డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావు తదితరులు పీఠాధిపతిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఆశ్రమ ప్రాంగణంలో 32 కేంద్రాలను (స్టాల్స్)ఏర్పాటు చేసారు. ఆశ్రమం వద్ద ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా 324 మంది నూతనంగా మంత్రోపదేశం పొందారు. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్ టివి వర్మ,ఎవివి. సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆరోగ్యకర జీవితానికి యోగా సాధన మార్గం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవనం సాగించాలంటే ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలని సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ పేర్కొన్నారు. మాధవపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన పకృతి యోగా సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి స్థానిక పెద్దలు విత్తనాల వెంకటరమణ అధ్యక్షత వహించగా సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ముఖ్యఅతిధిగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి పకృతి యోగా సెంటర్ను ప్రారంబించారు. ఈ సందర్భంగా యోగా గురువు వాసంశెట్టి వీరబాబును తలాటం హరీష్ సాలువా కప్పి జ్ఞాపికను బహుకరించి ఘనంగా సత్కరించారు. అదేవిదంగా కార్యక్రమంలో పాల్గొన్నా అతిధులు తలాటం హరీష్, ఫణీంద్ర, అర్జున్, జగదీష్, విత్తునాల వెంకటరమణ, మేడిశెట్టి నానీ ప్రసాద్ లను యోగా గురువు వీరబాబు దంపతులు సాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిధులు తలాటం హరీష్, అర్జున్, వెంకటరమణ, వీరబాబు లు మాట్లాడుతూ నిత్యం యోగా సాధన చేయడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## ఉగాది పండుగను పురస్కరించుకుని నాటిక పోటీలు



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం సి.ఆర్.సి. కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని మార్చి 30,31,ఏప్రిల్1 తేదీల్లో రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సిఆర్‌సి అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సిఆర్‌సి రూపశిల్పి డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ వెంకటరెడ్డి) తెలిపారు. రావులపాలెం సి.ఆర్.సి. ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు ఏడు ప్రదర్శనలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ కళాపరిషత్తులుకు చెందిన కళాకారులు ఈ నాటిక ప్రదర్శన ఇస్తారన్నారు గత 25 ఏళ్లుగా నాటక రంగానికి జీవం పోస్తూ ప్రతి ఏటా సి.ఆర్.సి. నాటికల పోటీలను నిర్వహిస్తుందన్నారు. ప్రేక్షకులు పెద్ద ఎత్తున తరలివచ్చి నాటక రంగాన్ని ఆదరించాలని కోరారు.

కార్యక్రమంలో సి.ఆర్.సి. ఉపాధ్యక్షుడు చిన్నం తేజారెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, సి.ఆర్.సి. కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, సి.ఆర్.సి. డైరెక్టర్లు మల్లిడి అంజనీ కుమార్ రెడ్డి, కొవ్వూరు నరేష్ కుమార్ రెడ్డి, మోటూరి సూర్య ప్రకాష్‌రావు, చిర్ల కనికిరెడ్డి, పడాల సత్యనారాయణ రెడ్డి, పర్యవేక్షకులు గంటా రామ్మోహన్రావు, పలివెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ విజేతకు మంత్రి సుభాష్ ప్రశంసలు



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : అంతర్జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో మూడు మెడల్స్ సాధించిన యాళ్ళ సురేష్ కుమార్ పై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రశంసల జల్లు కురిపించారు. రామచంద్రపురం నియోజకవర్గం కీర్తి ప్రతిష్టలు ప్రపంచ నలుమూలల తెలిసేలా ఒక బంగారు, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించడం పట్ల మంత్రి సుభాష్ ఆనందం వ్యక్తం చేశారు. ఈనెల ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు ఫోర్త్ వ్యాకో ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్ న్యూఢిల్లీ కేడిజాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో లైట్ మరియు లైట్ కాంటాక్ట్ విభాగాల్లో ద్రాక్షారామకు చెందిన, ఏడవ తరగతి విద్యార్థి యాళ్ళ సురేష్ కుమార్ (మైనస్ 37 కేజీ) క్రియేటివ్ ఫాలో గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే లైట్ కాంటాక్ట్ విభాగంలో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. తాను సాధించిన పథకాలతో సురేష్ కుమార్ తన తండ్రి యాళ్ళ అంజిబాబుతో కలిసి మంత్రి సుభాష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమని, వారి శారీరక దృఢత్వానికి క్రీడలు దోహద పడతాయి అన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాముఖ్యత నిస్తోందన్నారు. ఒత్తిడి, మానసిక ఆందోళన లేని విద్య విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. ఈ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్ కి రామచంద్రపురంకు చెందిన యండమూరి అంజనీకుమార్ రింగ్ రిఫరీగా, కోచ్ గా ఉండడం కూడా సంతోషకర విషయమని మంత్రి సుభాష్ అన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు తాను ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

## దామనపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ





రంపచోడవరం, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలోని దేవీపట్నం మండలం దామనపల్లి గ్రామంలో గ్రామస్తులు అందరు కలిసి అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులుతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల బంధుమిత్రులు అందరికి భారీగా అన్నదాన సమారాధన చేసారు. వనవాసి ధర్మ రక్షా సమితి రాజమహేంద్రవరం విభాగం తరుపున విగ్రహ దాత పొన్నపల్లి రమేష్, దివ్య దంపతులు (యుఎస్ఎ) విగ్రహం అందించగా ఈ కార్యక్రమంలో రంపచోడవరం మాజీ శాసనసభ్యులు శీతంశెట్టి వేంకటేశ్వరావు, వనవాసి ధర్మ రక్షా సమితి ప్రతినిధులు, సమరత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధార్మిక సంస్థల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, రంపచోడవరం ధర్మ ప్రచార భక్త మండలి నల్లమిల్లి వేంకట రామారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం విశిష్ఠత తెలియచేస్తునే గిరిజన సంప్రదాయాలు తరువాత తరాలకు అందించవలసిన భాధ్యత మనపై ఉందని గ్రామస్తులకు తెలియచేసారు.

## మద్యం షాపుల "డ్రా" వాయిదా...

**– పిఠాపురం ఎక్సైజ్ సీఐ రఘురామరాజు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** గీత కులాలకు కేటాయించిన షాపులకు "డ్రా" తీయు కార్యక్రమం వాయిదా పడినట్లు పిఠాపురం ఎక్సైజ్ సీఐ రఘురామరాజు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున 10 ఫిబ్రవరి 2025 సోమవారం జరగ వలసిన "డ్రా" వాయిదా వేయడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నికల కమిషన్ వారి అనుమతి తీసుకుని డ్రా తీయు తేదీని తెలియజేయడం జరుగుతుందన్నారు.

# 104 ఉద్యోగులకు వేతనాలు పెంచాలి




**– అరబిందో నుండి 4 ఏళ్ల బకాయిలు ఉద్యోగులకు ఇప్పించాలి**
**– యాజమాన్య వాటా పీఎఫ్ ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ కలక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్మా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తిగావస్తున్నా 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, ఉద్యోగులను కొనసాగించడమే కూటమీ ప్రభుత్వం చేసే గొప్ప మేలుగా చెబుతూ వేతనాలు పెంచడంపై దాటవేస్తుందని విమర్శించారు. పిఎఫ్ యాజమాన్య వాటా, కార్మికుల వాటా రెండు కూడా సిటీసీ పేరుతో ఉద్యోగుల జీతాలు నుండే కోత పెడుతున్నారని, దీనివల్ల ప్రతి ఉద్యోగి రూ.2500లు ప్రతినెల కోల్పోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం యాజమాన్యం వాటా ప్రభుత్వమే చెల్లించి, ధరలు కనుగుణంగా వేతనాలు పెంచాలని, సర్వీసు ఆధారంగా ఉద్యోగుల స్లాబ్ ను మార్చాలని డిమాండ్ చేశారు. అరబిందో యాజమాన్యం ప్రతీ సంవత్సరం 10 శాతం ఇంక్రిమెంట్ పెంచాల్సి ఉండగా గత 5 ఏళ్లలో ఒక్క సారి మాత్రమే పెంచారని, అరబిందో నుండి మిగిలిన 4 ఏళ్ళు 40 శాతం బకాయి వేతనాలు, గ్రాడ్యుటి, ఆర్జిత సెలవులు చెల్లించేలా ర్ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల సంఘ కోశాధికారి సిహెచ్ శ్రీనివాస్, డివిజన్ లీడర్ కె.సతీష్, సువర్ణ రాజు, ఎస్.కె.ఖలిసా, దుర్గాప్రసాద్, రవి, పాపారావు, సుబ్రహ్మణ్యం, అప్పారావు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8 వరకు పీజీఆర్ఎస్ రద్దు

**– ప్రజలు మీకోసం పోర్టల్ ద్వారా సచివాలయాల్లో అర్జీలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు**
**– కలెక్టర్ పీ.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పిజిఆర్ఎస్ సెషన్‌లకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ సూచనలు చెయ్యడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ఫిబ్రవరి 10 వ తేదీ పిజిఆర్ఎస్ నిర్వహించడం లేదని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం పోర్టల్ ద్వారా మీ సమీపంలో ఉన్న సచివాలయాల్లో అర్జీలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించడం జరిగిందని తెలిపారు.

ఫిబ్రవరి 27 వ తేదీన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కోసం ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జిల్లా , డివిజన్, మండల స్థాయిలో సోమవారం పిజిఆర్ఎస్ సెషన్‌లు రద్దు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు (మార్చి 8 వ తేదీ వరకు) ఈ రద్దు అమలులో ఉంటుంది.

ఫిర్యాదుల నమోదు కోసం సమీపంలోని సచివాలయాన్ని సందర్శించండి. న ఎన్నికల కోడ్ ఎత్తివేయబడే వరకు ఫిర్యాదులను సమర్పించడానికి "మీకోసం" ఆన్‌లైన్ పోర్టల్‌ని ఉపయోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ సమాచారాన్ని తెలియ చెయ్యడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆ ప్రకటనలో పేర్కొనడం జరిగింది. కావున ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా ఉండేందుకు, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పి జి ఆర్ ఎస్ నిర్వహించడం జరగనందున ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అర్జీలు ఇవ్వడానికి కలెక్టిరేట్, డివిజన్, మండల కేంద్రాలకు రావద్దని తెలియ చెయ్యడం జరుగుతోంది.

# బడుగువానిలంకకు తీరనున్న తాగునీటి సమస్యలు

**– రూ.39.6 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం**



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** గోదావరి నది మధ్యలో ఉండి తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి తాగునీటి సమస్య తీరనుంది. ఈ గ్రామం పూర్తిగా గోదావరి నీటిమట్టం పై ఆధారపడి ఉంటుంది. వేసవికాలం గోదావరిలో నీరు లేకపోవడంవల్ల ఇక్కడ 40 అడుగుల నీటిమట్టానికి పడిపోతుంది. అందుకనే ఇక్కడ సాధారణ మంచినీటి చేతి పైపులు పనిచేయవు. ఏజెన్సీ,మెట్ట ప్రాంతాల మాదిరిగా ఐఎం 2 చేతి వైపులతోనే గ్రామపంచాయతీ త్రాగునీటి సరఫరా చేస్తుంది. అలాగే సాధారణ వ్యవసాయ మోటార్లు కూడా ఇక్కడ పనిచేయవు. నీటిలో ఉండే శక్తివంతమైన మోటార్స్ మాత్రమే రైతులు వినియోగిస్తారు.

ఇటువంటి పరిస్థితుల్లో 2009లో కొత్తపేట ఎమ్మెల్యేగా గెలిచిన బండారు సత్యానందరావు 60 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంక్ ను బడుగువానిలంక పాతూరు లో నిర్మించారు. ఇది గ్రామం అంతటా పూర్తిస్థాయిలో త్రాగునీటిని అందించలేక పోతుంది. అందుకనే ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యే బండారు హయాంలోనే జల జీవన్ మిషన్ ద్వారా "ఇంటింటికీ కుళాయి' పథకంలో రూ.39.60 లక్షల వ్యయంతో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ ను కొత్తూరు మండల పరిషత్ స్కూల్ వద్ద నిర్మిస్తున్నారు. ఈ వాటర్ ట్యాంక్ కూడా అందుబాటులోకి వస్తే కొత్తూరు, దుర్గా నగర్, పాతూరు, ఎస్సీ,బిసీ కాలనీలు, గయాలు ప్రాంతాలకు త్రాగునీటి సమస్య అనేది ఉండదని చెప్పవచ్చు.

# కూటమి అభ్యర్థిని గెలిపించండి - ఎమ్మెల్యే పంతం నానాజీ





కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. ఆదివారం నియోజకవర్గంలో గల నేమం, పండురు, తిమ్మాపురం గ్రామాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థికి మద్దతుగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే సమావేశాలు నిర్వహించి, కూటమి ప్రభుత్వం గడచిన 6 నెలల కాలంలో చేసిన అభివృద్ధి చెబుతూ ఓటును అడిగాలని, మొదటి ప్రాధాన్యత ఓటును పేరాబత్తుల రాజశేఖర్‌కు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. రూరల్ నియోజకవర్గం పరిశీలకులు సుధాకర్, కుడిపూడి సత్తిబాబుతో కలిసి ప్రచారం నిర్వహించిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఈ ప్రచారంలో ఎన్నికలలో ఓటు ఏ విధంగా వేయాలి అవగాహనతోపాటు ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిపించాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో ఈ ఎన్నికలు చాలా కీలకమైనవని, సూపర్ సిక్స్ పథకాలకు పూర్తిగా నిజమైన లబ్ధిదారులకు చేరే విధంగా కృషి చేస్తారని. ప్రతి గ్రామంలోనూ పట్టభద్రులు ఎంతమంది ఉన్నారు తెలుసుకుని వారిని ఓటు వేయించవలసిన బాధ్యత మనపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు





**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు పినిపే విశ్వరూప్ ఆదేశాల మేరకు అలాగే కొత్తపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి నియమించిన జిల్లా మరియు కొత్తపేట నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆయన స్వగృహం నందు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గొల్లపల్లి డేవిడ్ నియమించబడ్డారు. అలాగే కొత్తపేట నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగానికి పాల నాగేశ్వరరావు, రైతు విభాగానికి పెదపూడి బాపిరాజు, బీసీ సెల్ విభాగానికి బొక్క ప్రసాద్, ఐటీ విభాగానికి కొవ్వూరి సుధాకర్ రెడ్డి, యువజన విభాగానికి నడింపల్లి వెంకట సుబ్బరాజు (వర్మ), విద్యార్థి విభాగానికి గొల్లపల్లి రాజశేఖర్ నియమించబడ్డారు. మమ్మల్ని అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమించిన చిర్ల జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు చెబుతూ, ఇచ్చిన బాధ్యతలపై కష్టపడతామని మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని అలాగే చిర్ల జగ్గిరెడ్డిని ఎంఎల్ఏ చేసేవరకూ శ్రమిస్తామని తెలిపారు.. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇంకా కష్టపడే నాయకులు, కార్యకర్తలకి కచ్చితంగా ఉన్నత స్థానాలలో పెట్టేలా కృషి చేస్తాను అలాగే 2019 నుండి 2024 మధ్యలో కార్యకర్తలు నిరుత్సాహం విషయం తెలుసుకుని జగన్మోహన్ రెడ్డి కూడా కార్యకర్తలకి ఈసారి పెద్దపీట వేస్తానని చెప్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరుగురు పేకాటరాయుళ్ళ అరెస్ట్

**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఎస్సై వి.మౌనిక ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, పెద్దాపురం పట్టణంలో స్థానిక సుధాకాలనీ వెనుక గల ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.